క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం



సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మానేరు తీరంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. నెహ్రూనగర్ అంబా భవాని ఆలయ వార్షిక మహోత్సవాలు శనివారం వైభవంగా కొనసాగాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరాగా ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ అధ్యక్షుడు చిలుక నారాయణ, బొల్లి శ్రీధర్‌శర్మ, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో కరీంనగర్ కలెక్టర్



కలెక్టర్ పమేలా సత్పతికి స్వామివారి ప్రసాదం, పట్టుచీర అందిస్తున్న అర్చకుడు

వేములవాడ: ఎములాడ రాజన్నను శనివారం కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలు అందజేశారు. ఏఈవో అశోక్, పర్యవేక్షకులు, ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



తంగళ్లపల్లి: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని తాడూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం బూర రవీందర్ అన్నారు. శనివారం విద్యార్థులతో పలు సైన్స్ ప్రయోగాలను చేయించి వారికి అవగాహన కల్పించారు. ఆరవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్‌హౌజ్ నిర్మాణ పనులు షురూ



వేములవాడ: నియోజకవర్గంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మోడల్‌హౌజ్‌ను మండల పరిషత్ ఆవరణలోని వ్యవసాయాధికారి కార్యాలయం పక్కన పనులు ప్రారంభించారు. త్వరలోనే పనులు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

డిజిటల్ క్రాప్ సర్వే



కందికట్కూర్‌లో డిజిటల్ క్రాప్ సర్వే చేస్తున్న ఏఈవో లలిత

ఇల్లంతకుంట: కేంద్రప్రభుత్వం పంటల సాగుపై చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేను పొత్తూరు క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి బి లలిత శుక్రవారం కందికట్కూరులో నిర్వహించారు. పొత్తూరు, కందికట్కూర్, రంగంపేట నర్సక్కపేటలో పర్యటించి ప్రతి భూమి సర్వే నంబర్‌ను మ్యాప్ ద్వారా డిజిటలైజేషన్ చేస్తున్నట్లు ఏఈవో తెలిపారు. కందికట్కూర్‌లో డిజిటల్ క్రాప్ సర్వే కోసం 1800 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారికి మానేరు నదిలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం తెప్పోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గంగాహరతి, తీర్థప్రసాద వితరణ చేశారు. గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

అనుమతికి మించి ఇసుక రవాణా

సిరిసిల్ల క్రైమ్: సిరిసిల్ల మానేరుబావి నుంచి ఇసుకను తంగళ్లపల్లి మండలానికి తరలించేందుకు అధికారులు శనివారం అనుమతినిచ్చారు. దీనిని ఆసరాగా చేసుకుని పలువురు ట్రాక్టర్ యజమానులు మానేరువాగు నుంచి ఇసుకను స్థానికంగా డంపు చేసినట్లు విమర్శలున్నాయి. అనుమతి ఇచ్చిన ప్రాంతానికి ఇసుక తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య ‘యోగ’ం

- సంపూర్ణ ఆరోగ్యానికి యోగా
- పట్టణంలో మహిళలకు ప్రత్యేక శిక్షణ తరగతులు
- నిత్యం సాధన చేసేందుకు ఆసక్తి





సిరిసిల్లకల్చరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇంటిల్లిపాది బరువు, బాధ్యతలు మోస్తూ నిత్యం ఒత్తిడికి గురవుతూ ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వని సాధారణ మహిళలు సైతం ఇప్పుడు యోగాసాధన చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. వివిధ వృత్తులు, ఉద్యోగా చేస్తున్న మహిళలతో పాటు సాధారణ మహిళలు, గృహిణులు సైతం ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన యోగాచార్యులు (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) ఉప్పుల శ్రీనివాస్ స్థానిక తక్షశిల ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో మహిళలకు ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాడు. సమీప మహిళలతో పాటు దూరప్రాంతాల నుంచి వచ్చి యోగా చేస్తున్నారు. నిత్యసాధనతో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతున్న పలువురిపై సండే స్పెషల్ కథనం..

ఆరోగ్య సమస్యలు దూరం



యోగ చేయకముందు చాలా సమస్యలతో బాధపడేదాన్ని. కొన్నాళ్లుగా యోగా చేయడం ద్వారా వెన్నునొప్పినుంచి ఉపశమనం లభించింది. యోగాతో ఆరోగ్య సమస్యలు దూరమయ్యాయి. – రాపెల్లి సౌజన్య, గృహిణి

ఆరునెలలుగా యోగా



అంబేద్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్నా. ఆరునెలలుగా యోగా సాధన చేస్తున్నా. సీఎం కప్ యోగా పోటీల్లో రజత పతకం సాధించాను. యోగా సాధనతో నాకు వచ్చిన పతకం మంచి స్ఫూర్తినిచ్చింది. – ఎం.లావణ్య, ఆశావర్కర్

శిక్షణ తరగతులకు వస్తున్నా



యోగా చేయాలని ఎప్పుడూ అనుకో లేదు. మగ్గం వర్క్‌చేస్తూ నలుగురికి నేర్పిస్తాను. అనుకోకుండా బ్యాక్ పెయిన్‌తో ఇబ్బంది పడేదాన్ని. తెలిసిన వారి సూచనమేరకు యోగా శిక్షణ తరగతులకు హాజరవుతున్నా. ఇప్పుడు సమస్య తగ్గిపోయింది. – ఎం.సౌజన్య, గృహిణి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అందరి నమ్మకం. కొన్ని నెలలుగా మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. చాలామంది శిక్షకులుగా రాణిస్తూ నిత్య యోగా సాధనకు ప్రచారం కల్పిస్తున్నారు. రోజురోజుకూ యోగాపై ప్రతిఒక్కరిలో ఆసక్తి పెరుగుతోంది.శిక్షణ తరగతులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. – ఉప్పుల శ్రీనివాస్, యోగాచార్యుడు

నేతకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ



నిరసన తెలుపుతున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: పవర్లూమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బీవైనగర్‌లో పనిచేస్తున్న పవర్లూమ్ కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. 2023 యారన్ సబ్సిడీ, కూలీ పెంపు , వర్కర్ టు ఓనర్, తదితర సమస్యలపై కార్మికులతో చర్చించారు. సిరిసిల్లలో ఏడాదిగా సరైన ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపు 15 మంది పవర్లూమ్, అనుబంధ రంగాల కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల స్థానంలో మహిళా పొదుపు సంఘాల మహిళలకు చీరల ఆర్డర్లు ఇచ్చిందన్నారు. ఈ చీరలకు సంబంధించి పవర్లూమ్ కార్మికులకు రోజుకు కనీసం రూ.1000 వేతనం వచ్చే విధంగా కూలీ నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వం, కలెక్టర్ కార్మికులకు అందుబాటులో ఉండేలా చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని యథావిధిగా బీవైనగర్‌కు మార్చాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 17 తర్వాత సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఇక్కడ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు నక్క దేవదాస్, ఎనగంటి సత్యనారాయణ, కందుకూరి రమేశ్, ఎలగొండ దాసు, కూరపాటి శేఖర్, లచ్చయ్య, ప్రవీణ్, సతీశ్, రమేశ్, శ్రీనివాస్, రాజేశ్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వేములవాడఅర్బన్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. వేములవాడ మండలం చింతాల్‌ఠాణా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై శనివారం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. జీపీ కార్మికులకు రెండునెలల వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. 51జీవో రద్దు చేసి 60 జీవో ప్రకారం రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, ప్రమాదబీమా కల్పించాలన్నారు. కార్మిక సంఘం నాయకులు రవీందర్, రామయ్య, చెల్లయ్య, దుర్గయ్య, మొండయ్య తదితరులు ఉన్నారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం మాలతి

ఎల్లారెడ్డిపేట: దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి కృష్ణహరి అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ..అంగవైకల్యమున్నా ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. ఫిజియోథెరపీ శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అర్హులైన వికలాంగ విద్యార్థుల కోసం ట్రై సైకిల్, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు అందించేందుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాలతి, సీఆర్‌పీ చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామీణ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

- డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: గ్రామీణ జర్నలిస్టుల సంక్షేమానికి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) కృషి చేస్తుందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలో శనివారం బీఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈసందర్భంగా టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కోశాధికారి గంగు సతీశ్, సంయుక్త కార్యదర్శి దీకొండ అశోక్, కార్యవర్గ సభ్యుడు సిద్దోజు ప్రశాంత్ ఆ యూనియన్‌లోని పదవులకు రాజీనామా చేసి డబ్ల్యూజేఐలో చేరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివరాత్రి ప్రమోద్‌కుమార్, బొడ్డు పరుశరాములు, కటకం సంతోష్, కంకనాల శ్రీనివాస్, అల్లె రమేశ్, నాయిని బాబు, రాపల్లి భాస్కర్, బుస్స రామనాథం, ఆకునూరి శంకర్, మడుపు మేఘనాథరెడ్డి, భాస్కర్, దొంతుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక కాలువ పరిశీలన



జిల్లెల్లలో రంగనాయక కాలువను పరిశీలిస్తున్న రైతులు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామశివారు రంగనాయక సాగర్ కాలువను శనివారం పలుగ్రామాల రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంట పొలాలకు సాగునీరందించే రంగనాయక కాలువను మూసివేయడంతో జిల్లెల్ల, మల్లాపూర్, దేశాయిపల్లె, అంకిరెడ్డిపల్లె, ఓబులాపూర్ గ్రామాలకు సాగునీరు నిలిచిందని వాపోయారు. జిలా ఉన్నతాధికారులు దృష్టిసారించి వ్యవసాయానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ ఆయాగ్రామాల రైతులు తదితరులున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తండాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని అక్కపల్లి, గుండారం, మైసమ్మ చెరువుతండా, బుగ్గరాజేశ్వర తండా, లక్ష్మీపూర్ తండా, మొర్రపూర్ తండాల్లో దాడులు చేశారు. 300 లీటర్ల బెల్లం పానకం, 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తండాల్లో నాటుసారాను తయారు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గుడుంబా తయారీదారుల పేర్లు తమకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

సంక్షిప్త వార్తలు

● పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో సీసీరోడ్ల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు అన్నారు. నిర్మాణ పనులను శనివారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గంట బుచ్చాగౌడ్, నారాయణ, సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ ఇలియాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.

● మట్టి తరలిస్తున్న రైతుకు జరిమానా

చందుర్తి: అక్రమంగా తమ వ్యవసాయ భూమి నుంచి మట్టి తరలిస్తున్న మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లయ్య అనే రైతుకు రూ.11వేలు జరిమానా విధించినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ సొంత భూముల్లోని నుంచి మట్టిని తరలించినా అనుమతి తీసుకోవాలన్నారు. అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

● విచారణ చేపట్టాలి

ముస్తాబాద్: పోతుగల్‌లో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవన నిర్మాణంలో నాణ్యత లోపంపై విచారణ చేపట్టాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సొల్ల క్రాంతి, నాయకులు కోల కృష్ణ, కస్తూరి కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండేళ్ల క్రితమే భవన నిర్మాణ పనులు మొదలైనప్పుడు నాణ్యత లోపించిందని, అప్పుడే ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పుడు భవనం పగుళ్లు బారిందన్నారు. ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై కలెక్టర్ విచారణ చేయాలన్నారు.

● ఎరువుల కోసం క్యూ

కోనరావుపేట: మండలం సుద్దాలలోని సింగిల్‌విండో ఎరువుల గోదాం వద్ద ఎరువుల కోసం రైతులు క్యూ కట్టారు. రైతులకు ఒకేసారి ఎరువులు అవసరం కావడంతో బారులుతీరారు. కాగా గోదాంలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● రక్తదానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ కావడంతో అత్యవసరంగా రక్తం అవసరం పడింది. స్థానికులు కందుకూరి రవి, గట్టు గోపి శనివారం రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసిన ఇద్దరిని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ అభినందించారు.

● ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోయినపల్లి: వేములవాడ పరిధిలో ఇసుక రవాణాకు అధికారుల వద్ద అనుమతులు తీసుకొని మండలంలోని అనంతపల్లికి ఇసుక రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూలం పృథ్వీధర్ గౌడ్ శనివారం తెలిపారు. వేములవాడ మండల పరిధిలో ఇసుక రవాణాకు మొదట పర్మిషన్ తీసుకున్నారు. అనుమతి సమయం దాటిన తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని అనంతపల్లిలో ఇసుక రవాణా చేస్తుండగా ముందస్తు సమాచారంతో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఈశ్వర్, యజమాని సాయిపై కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శిలాఫలకాలకు ముసుగు

చందుర్తి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండలకేంద్రంలోని శిలాఫలకాలకు శనివారం ముసుగులు వేశారు.మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ముసుగులు వేయించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయి అధికారులు ఆదేశాలు జారీచేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి: మండలకేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెడుతునపల్లి చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంగు తిరుపతి శనివారం పంపిణీ చేశారు. మండలకేంద్రానికి చెందిన సయ్యద్ మోహినికి రూ.25 వేలవిలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందించినట్లు చెప్పారు. శ్రీనివాస్, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి(నిమ్మపల్లి) నుంచి కొండాపూర్‌కు వెళ్లే దారిలో మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : అనిల్, గ్రామ కార్యదర్శి సెల్ నెం. 9000499120

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీడీ కార్మికులకు రూ.4వేలు అందించాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ బీడీ కార్మికురాలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మూశం రమేశ్ అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో బీడీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 90 వేల మంది కార్మికుల ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కొంతకాలంగా కార్మికులకు పని తగ్గించడంతో నెలకు వారం రోజులు కూడా పని దొరకని పరిస్థితి నెలకొందన్నారు. బీడీ కార్మికుల వేతనం పెంచకపోవడం, ప్రభుత్వం అండతోనే బీడీ యజమాన్యం ఆగడాలు పెరిగిపోతున్నాయన్నారు. వెంటనే బీడీ యజమానుల దోపిడీని అరికట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. బీడీ యూనియన్ జిల్లా నాయకులు సూరంపద్మ, జిందం కమలాకర్, దాసరిరూప, బెజిగం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



కోనరావుపేటలో సంబరాల్లో పాల్గొన్న నాయకులు

గంభీరావుపేట: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మండల బీజేపీ నాయకులు శనివారం సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణకాంత్ యాదవ్, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీపురం రాజు, బుచ్చిబాబు, మహేష్ యాదవ్, దేవాగౌడ్, దేవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో కోనరావుపేట మండలంలోని నాయకులు పటాకులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు.

ఇల్లంతకుంట: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై మండలకేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు దేవొట్టి శ్రీనివాస్, మేకల మల్లేశం, నాగ సముద్రాల సంతోష్, మామిడి హరీశ్, సుధీర్‌రెడ్డి, వజ్జపెల్లి శ్రీకాంత్, గజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు శుభ్రం

సాక్షి స్పందన



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

కోనరావుపేట: మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద మూత్రశాలలను పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. శనివారం ‘కంపుకొడుతున్నయ్’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగించారు.

● ఎరువుల కొరత లేదు

ఎల్లారెడ్డిపేట: ప్రాథమిక సహకార సంఘాలలో ఎలాంటి ఎరువుల కొరత లేదని జిల్లా సహకార అధికారి రామకృష్ణ తెలిపారు. ‘సాక్షి’లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. రైతులను క్రమ పద్ధతిలో క్యూలో వచ్చేలా చూస్తూ.. అందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

● మురుగు తొలగించారు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో మురుగుకాలువలను శనివారం అధికారులు శుభ్రం చేయించారు. గ్రామంలో మురుగుకాలువల్లో నీరు నిలిచి దుర్గంధం వ్యాపిస్తుందని శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని అన్నివార్డులు తిరుగుతూ మురుగును శుభ్రంచేయించి పిచ్చి మొక్కలను తొలగించారు.

మంత్రి పొన్నం పరామర్శ



కూస రవీందర్‌ను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బోయినపల్లి: మండలంలోని నీలోజీపల్లికి చెందిన కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ తండ్రి కూస రామస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. రామస్వామి అంత్యక్రియలు శనివారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కూస రవీందర్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి పరామర్శించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ జోగినిపల్లి వెంకట్రామారావు, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మెన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, వీసీ. నిమ్మ వినోద్‌రెడ్డి, సంగీతం శ్రీనివాస్, మండల, బ్లాక్, కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, నాయకులు పులి లక్ష్మీపతి, ఏనుగుల కనుకయ్య, సంబ లక్ష్మీరాజం, జంగం అంజయ్య, జంగ సత్యం, నాగుల వంశీ తదితరులు ఉన్నారు.

షెడ్డు నిర్మాణం చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పాత రైస్‌మిల్లు నుంచి వచ్చే దుమ్ముతో వాహనదారులు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు వెంటనే షెడ్డు నిర్మాణం చేసుకోవాలని పంచాయతీ అధికారులు ఆదేశించారు. మండలకేంద్రం శివారులో కొత్తగా పారబాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆ ప్రాంత రైతులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు శనివారం పరిశీలించారు. పారా బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, పాత రైస్‌మిల్లు నుంచి వస్తున్న ధూళి రాకుండా షెడ్డు నిర్మాణం చేపట్టాలని మిల్లు యజమానికి అధికారులు సూచించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.